ఘనంగా 'తానా అమ్మనాన్నా గురువు' పద్యార్చన



పద్యాలు పాడుతున్న విద్యార్థులు

ముషీరాబాద్: ముషీరాబాద్‌లోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో తానా అమ్మ నాన్నా గురువు పద్యార్చన కార్యక్రమం ఘనంగా జరిగిందని పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌కుమార్ తెలిపారు. సోమవారం ఉత్తర అమెరికా తెలుగు సంఘం తానా, వివిధ దేశాలలో ఉన్న తెలుగు సంఘాల సమన్వయంతో వందే విశ్వ మాతరం పేరుతో చిగురుమళ్ల శ్రీనివాస్ వంద దేశాలలో నిర్వహిస్తున్న శాంతి సద్భావన యాత్రలో భాగంగా తానా అమ్మనాన్నా గురువు శతక పద్యార్చన కార్యక్రమం స్కూల్‌లో నిర్వహించామన్నారు. సుమారు 450 మంది విద్యార్థులు ఏకధాటిగా సామూహిక గురు శతక పారాయణం చేశారు. ఈ సందర్భంగా అశోక్‌కుమార్ మాట్లాడుతూ... విద్యార్థులకు పెద్దల పట్ల గౌరవం పెంచడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు భార్గవి, శ్రీధర్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికలకు కసరత్తు

అసెంబ్లీ సెగ్మెంట్లకు ఏఆర్‌ఓల నియామకం

సికింద్రాబాద్: ఇటీవల శాసనసభ ఎన్నికల తంతును పూర్తిచేసిన అధికారులు త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల కోసం కసరత్తు చేస్తున్నారు. తాజాగా మళ్లీ ఓటర్ల జాబితా సవరణలు, పేర్ల నమోదు మొదలు పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, సిబ్బంది నియామకం తదితర వాటి కోసం చర్యలు తీసుకునే ప్రక్రియ ప్రారంభమైంది. ఇందుకోసం ఎన్నికల కమిషన్ అధికారులు ప్రత్యేక అధికారులను నియమించారు. సికింద్రాబాద్, సనత్‌నగర్, అంబర్‌పేట్, ముషీరాబాద్ నియోజకవర్గాల్లో ఎన్నికల ఏర్పాట్ల కోసం అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులను (ఏఆర్‌ఓ) నియమించారు. ఏఆర్‌ఓలుగా జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్ డిప్యూటీ కమిషనర్ ఎస్.సుధాంశ్, సికింద్రాబాద్ తహసీల్దార్ పాండు నాయక్, మారేడుపల్లి తహసీల్దార్ పద్మసుందరి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్.ఎల్లారెడ్డిని నియమిస్తున్నట్టు ఎన్నికల కమిషన్ అధికారులు గెజిట్ జారీ చేశారు. అధికారుల నియామకంతో పాటుగా అదనపు ఓటర్ల జాబితా రూపకల్పన కోసం ఉత్తర్వులు జారీ చేశారు. వచ్చే వారం నుంచి ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు అమలులోకి తెచ్చేందుకు సహాయక రిటర్నింగ్ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. త్వరలో నియోజకవర్గాల వారీగా ఓటర్ల విభాగం, ఎన్నికల అధికారులతో సహాయక రిటర్నింగ్ అధికారులు సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. హైదరాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్‌గా వ్యవహరించనున్నట్లు ఎన్నికల కమిషన్ గెజిట్‌లో పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో ధనుర్మాస ఉత్సవాలు

చిలకలగూడ: చిలకలగూడలోని పలు ఆలయాల్లో ధనుర్మాస వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. శ్రీనివాసనగర్ శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో జనవరి 14వ తేదీ వరకు ప్రతిరోజు ధనుర్మాస పూజ, ప్రాతరారాధన, దీపారాధన, పాశురాలు, తిరుప్పావై పఠనం, నవకళశ అభిషేకం, ఉత్తరద్వార దర్శనం, సర్వదర్శనం, కుడారవల్లి ఉత్సవం, గోదా కల్యాణం తదితర ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్ష ఉపాధ్యక్షులు బసవరాజు శ్రీనివాస్, వేణుగోపాలరావు ఈఓ రాజేష్‌కుమార్ తెలిపారు. ప్రతిరోజు సాయంత్రం మరింగంటి విజయ్‌కుమార్ నేతృత్వంలో తిరుప్పావై ప్రవచనం ఉంటుందన్నారు. ఈనెల 23 వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని నామాలగుండు కల్యాణ వేంకటేశ్వర స్వామి, చిలకలగూడ సాయిబాబా సమేత బాలాంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, ఉత్తర ద్వార దర్శనం ఉంటుందని ఆలయ ఛైర్మన్లు నోముల ప్రకాశరావు, నాగులూరి సాయిబాబా తెలిపారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



కవాడిగూడ: ఇందిరాపార్కులో డాక్టర్ హిప్నోకమలాకర్స్ మైండ్ అండ్ పర్సనాలిటీ కేర్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. వేడుకలకు డాక్టర్ హిప్నో పద్మాకమలాకర్, జి.కృష్ణవేణి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... క్రిస్మస్ పండగ ప్రేమకు చిహ్నంగా భావిస్తారన్నారు. క్రిస్మస్ వేడుకలలో సైనిక్‌పురి భవన్ స్కూల్ విద్యార్థులు పాల్గొని సందడి చేశారు. క్రిస్మస్ శాంతాక్లాజ్‌గా ప్రముఖ యోగా గురువు, బి.సరోజిని ఆకట్టుకున్నారు. అనంతరం క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులను అందజేశారు. నిర్వాహకులు బి.రామారావు, డాక్టర్ గీత, సైకాలజిస్టు జ్యోతిరాజ, యశోద, పూర్ణకుమారి, ప్రహ్లాద్ తదితరులు పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

నాంపల్లి: నిలోఫర్ ఆసుపత్రిలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని నిలోఫర్ ఆసుపత్రి ఎస్సీ, ఎస్టీ, ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు డి.రవీందర్, కార్యనిర్వాహక అధ్యక్షులు జి.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం నిలోఫర్ ఆసుపత్రి సూపరింటెండెట్ డాక్టర్ ఉషారాణికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రవీందర్, శ్రీనివాస్ మాట్లాడుతూ... ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. జి.ఓ నెం.60 ప్రకారం... పేషంట్ కేర్ ఎంప్లాయిస్ అండ్ సెక్యూరిటీ శానిటేషన్ సిబ్బందికి రూ.15,600 చెల్లించాలని, ఏడాదికి పన్నెండు క్యాజువల్ సెలవులు, మహిళా సిబ్బంది ఐదు స్పెషల్ క్యాజువల్ సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆరోగ్య శ్రీ కింద డేటా ఎంట్రీ చేసే సిబ్బందికి 30 శాతం ఇంక్రిమెంట్‌ను న్యాయపరంగా అందించాలని కోరారు. అలాగే ప్రతి నెలా ఒకటవ తేదీనే వేతనాలు చెల్లించాలని కోరారు. సమస్యలపై సూపరింటిండెంట్ సానుకూలంగా స్పందించారని తెలిపారు.

రోడ్డుపైకి వ్యర్థాలు



జూబ్లీహిల్స్ రోడ్ నెం.10లోని అంతేరా హోటల్ ముందు..

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్ నెం.36లోని అంతేరా హోటల్ ముందు ప్రధాన రోడ్డుపై డ్రైయినేజీ మ్యాన్ హోల్ పొంగిపొర్లుతూ పది రోజుల నుంచి రోడ్డంతా దుర్గంధమయం అయింది. ఈ హోటల్ నుంచి వ్యర్థాలు, ఇతర చెత్తాచెదారం పైప్ లైన్ల నుంచి డ్రైనేజీ మ్యాన్‌హోల్‌లోకి చేరడంతో మ్యాన్‌హోల్ పైపులు నిండిపోయి డ్రైనేజీ, వ్యర్థాలు పైకప్పు నుంచి బయటికి పొంగాయి. సోమవారం పలువురు ఈ విషయాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేసి రోడ్డంతా దుర్గంధమయమైన విషయంపై జలమండలి నిర్వాకాన్ని ఎండగట్టారు. స్పందించిన జలమండలి డీజీఎం శ్రీనివాస్ సిబ్బందితో కలిసి అంతేరా హోటల్ వద్దకు వచ్చి పరిస్థితిని పరిశీలించారు. పెద్ద ఎత్తున వ్యర్థాలు డ్రైనేజీ మ్యాన్‌హోల్ నుంచి రోడ్డు మీదికి వచ్చిన పరిస్థితిని గమనించి ఇందుకు కారాణాలపై ఆరా తీశారు. హోటల్ పైపుల నుంచే వ్యర్థాలన్నీ అక్రమంగా ఈ మురుగు కాల్వలోకి కలుపుతున్నట్లుగా గుర్తించి హోటల్‌కు నోటీసులు జారీ చేశారు. ఈ హోటల్‌తో పాటు స్థానికంగా ఉన్న మరో మూడు హోటళ్లకు కూడా నోటీసులు ఇచ్చారు. మూడు రోజుల్లో హోటళ్ల సిబ్బంది సిల్ట్ ఛాంబర్లు నిర్మించుకోవాలని సూచించారు.

అంబర్‌పేటను ఆదర్శంగా తీర్చిదిద్దుతా

- ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్
- నింబోలిఅడ్డాలో రూ. 25 లక్షలతో డ్రైనేజీ పైప్‌లైన్ పనుల ప్రారంభం



పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

కాచిగూడ: అంబర్‌పేట నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలను సమగ్రంగా అభివృద్ధి చేసి ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తన ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. సోమవారం కాచిగూడ డివిజన్ నింబోలిఅడ్డాలో రూ. 25 లక్షల వ్యయంతో చేపట్టనున్న డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్‌తో కలిసి ఎమ్మెల్యే కాలేరు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే... ప్రజలకు అవసరమైన రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి సరఫరా, పార్కుల ఏర్పాటు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రజలు కూడా తమ సమస్యలను ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఆయా సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

- అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులందరికి అందేలా కృషి చేస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజలు కూడా అభివృద్ధి పనులకు సహకరించాలని సూచించారు.
- ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం చేయవద్దని హెచ్చరించారు. నిర్లక్ష్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించమని కాలేరు వెంకటేష్ హెచ్చరించారు.



కాలేరును అభినందిస్తున్న బీఆర్‌ఎస్ నేతలు

- కార్యక్రమంలో బీఆర్‌ఎస్ కాచిగూడ డివిజన్ అధ్యక్షుడు ఎర్ర భీష్మదేవ్, దాత్రిక్ నాగేందర్ బాబ్జీ, బి.కృష్ణాగౌడ్ ప్రతిభ, మహేందర్ నాయి, బీజేపీ నేతలు కన్నె రమేష్ యాదవ్, సుభాష్ పటేల్, లక్ష్మపురి సత్యనారాయణ, బి.భీమ్‌రాజ్, ఆర్.సంతోష్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కాలేరుకు అభినందన

అంబర్‌పేట ఎమ్మెల్యేగా కాలేరు వెంకటేష్ రెండోసారి భారీ మెజార్టీతో గెలుపొంది మొదటిసారి కాచిగూడకు వచ్చిన సందర్భంగా బీఆర్‌ఎస్ రాష్ట్ర నేత దాత్రిక్ నాగేందర్ బాబ్జీ ఆధ్వర్యంలో స్థానిక బీఆర్‌ఎస్ నేతలు ఎమ్మెల్యేను పూల బొకే అందజేసి, శాలువాతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఆధ్వర్యంలో అంబర్‌పేట నియోజవర్గం మరింత అభివృద్ధి చెందుతుందని వారు తెలిపారు.

ముగ్గుబస్తీ కమ్యూనిటీ హాల్‌కు మరమ్మతులు చేయండి



కార్పొరేటర్‌కు వినతి పత్రం ఇస్తున్న ముగ్గుబస్తీ నాయకులు

కవాడిగూడ: కవాడిగూడ డివిజన్ ముగ్గుబస్తీ పరిధిలోని కమ్యూనిటీ హాల్‌కు మరమ్మతులు చేపట్టాలని ముగ్గుబస్తీ సేవా సంఘం నేతలు కార్పొరేటర్ జి.రచనశ్రీని కోరారు. ఈ మేరకు సోమవారం కార్పొరేటర్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గ్రౌండ్‌ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్, సెకండ్ ఫ్లోర్‌లలో ఎలక్ట్రికల్ వర్క్స్, బాత్రూమ్ డోర్స్, విండోస్ పూర్తిగా పాడైనందున స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వాటిని వీలైన తొందొరగా మరమ్మతులు చేయించి అందుబాటులోకి తేవాలని కోరామన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు ఇ.కృష్ణ, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ గౌడ్, జాయింట్ సెక్రెటరీ బాలకృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ జి.లవణ్, సలహాదారులు విష్ణు, జాయింట్ సెక్రటరీ బాబు, అశోక్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి

భారతీయ కేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యదర్శి బాలమల్లేష్

హిమాయత్‌నగర్: వ్యవసాయ కూలీలు, భూమిలేని బడుగు బలహీన వర్గాల వారి పరిస్థితి హృదయ విదారకంగా ఉందని భారతీయ కేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యదర్శి ఎస్.బాలమల్లేష్ ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమల్లోని కార్మికులతో పోలిస్తే వ్యవసాయ కూలీల వేతన స్థాయి చాలా తక్కువని, సామాజిక రక్షణ కూడా లేని వారిని కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. హిమాయత్‌నగర్‌లోని మఖ్దూమ్ భవన్‌లో సోమవారం తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సమితి సమావేశం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన బాలమల్లేష్ మాట్లాడుతూ... వ్యవసాయ కార్మికుల జీవనోపాధి భద్రతను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం విస్మరించాయని ఆరోపించారు. వ్యవసాయ కార్మికులకు ఉపాధినిచ్చే మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టం బడ్జెట్ నిధుల్లో కేంద్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం 30 శాతానికి పైగా కోతలు విధించి వ్యవసాయ కార్మికుల కడుపు కొడుతుందన్నారు. వచ్చే సంవత్సరం గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి రూ. 10 వేల కోట్లు బడ్జెట్ కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వారికి ప్రాథమిక సామాజిక భద్రతలో భాగంగా డబల్ బెడ్ రూమ్ ఇళ్లు, బీమా, వైద్య సంరక్షణ, ప్రసూతి, వద్ధాప్య ప్రయోజనాలు అందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని విజ్ఞప్తి చేశారు. సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.సజన కుమార్, రాష్ట్ర నాయకులు ఎల్.శ్రావణ్‌కుమార్, టి.శంకర్, బాబు, బి.నరసింహ, విజయ, లక్ష్మయ్య, భిక్షపతి, బి.రవీందర్, వి.బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో అరబిక్‌ను బోధించాలి



మాట్లాడుతున్న సయ్యద్ వికారుద్దీన్ అలీ

హిమాయత్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలలో అరబిక్ భాషకు ప్రాధాన్యం కల్పించి, పాఠశాలల్లో అరబిక్ భాషను బోధించేలా చర్యలు తీసుకోవాలని రహబర్ సొసైటీ విజ్ఞప్తి చేసింది. ప్రపంచ అరబిక్ భాషా దినోత్సవాన్ని రహబర్ సొసైటీ జనరల్ సెక్రటరీ సయ్యద్ వికారుద్దీన్ అలీ ఆధ్వర్యంలో బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సయ్యద్ వికారుద్దీన్ అలీ మాట్లాడుతూ... ప్రపంచంలోని ప్రముఖ భాషలలో అరబిక్ ముఖ్యమైనదని, ఐక్యరాజ్య సమితి సైతం గుర్తించిందన్నారు. అందులో భాగంగా 2012 నుంచి ప్రతి సంవత్సరం డిసెంబర్ 18న ప్రపంచ అరబిక్ భాషా దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రపంచంలో 450 మిలియన్ల కంటే ఎక్కువ మంది అరబిక్ మాట్లాడే వారు ఉన్నారని, ప్రపంచ వ్యాప్తంగా మాట్లాడే 50కి పైగా ఉన్న భాషలకు అరబిక్ పదజాలం ముఖ్యమైన మూలమని ఆ భాష గొప్పదనాన్ని తెలియజేశారు. తెలంగాణ రాష్ట్రంలో కూడా ప్రభుత్వం చొరవ తీసుకొని పాఠశాలలో స్కూల్ లెర్నింగ్ ప్రోగ్రామ్‌లో విద్యార్థులకు అరబిక్ భాషను ప్రోత్సహించడానికి ప్రత్యేక చొరవ అందించడానికి కృషి చేయాలని కోరారు. సయ్యద్ రహబర్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచితంగా నేర్పించడానికి ఉపాధ్యాయులను ఏర్పాటు చేస్తామని తెలిపారు.

వడ్డెరల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలి



మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సన్మానిస్తున్న వడ్డెర సంఘం నేతలు

హిమాయత్‌నగర్: అన్ని రంగాలలో వెనుకబడిన వడ్డెర సామాజిక వర్గాన్ని గుర్తించి, వడ్డెరకు ఆర్థికాభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని జాతీయ వడ్డెర సంఘం అధ్యక్షుడు వేముల వెంకటేష్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పదవీ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా వెంకటేష్ నేతత్వంలో సంఘం ప్రతినిధి బృందం మంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలియజేసి, ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వేముల వెంకటేష్ మాట్లాడుతూ... వడ్డెరుల అభివృద్ధి, సంక్షేమం కోసం అధికంగా నిధులు కేటాయించాలని, నామినేటెడ్ పదవుల్లో వడ్డెర్లకు అవకాశం కల్పించాలని మంత్రిని కోరారు. సంఘం కోశాధికారి బత్తుల లక్ష్మీకాంతయ్య, నాయకులు మధు, తిరుమలేశ్, వెంకట్ పాల్గొన్నారు.

ఆస్పత్రి అభివృద్ధికి కృషి

లాలాపేట: హాస్పిటల్ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్‌రెడ్డి అన్నారు. సోమవారం అర్బన్ హెల్త్ పోస్టు తుకారాంగేటు (యూపీహెచ్‌సీ) లాలాపేట పట్టణ ఆరోగ్య కేంద్రంలో హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ సమావేశం జరిగింది. ఎస్పీహెచ్‌ఓ డాక్టర్ జయశ్రీ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ పాల్గొని పలు అంశాలపై చర్చించారు. టాయ్‌లెట్, డ్రెసింగ్ రూమ్, తాగునీరు, తదితర కనీస సౌకర్యాలు లేవని అక్కడి వైద్యులు డిప్యూటీ మేయర్ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆమె వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలన్నీ పరిష్కరించాలని సూచించారు. ఈ సమావేశంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సౌశీల్యారాణి, స్థానిక ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా సుబ్రమణ్య షష్ఠి



పూజల్లో పాల్గొన్న కార్పొరేటర్ పావని, ఈవో లక్ష్మారెడ్డి

చిక్కడపల్లి: ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని లక్ష్మీగణపతి ఆలయంలో సోమవారం సుబ్రమణ్యస్వామి షష్ఠి పూజలు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని సుబ్రమణ్యస్వామి వారికి ఉదయం 6 గంటలకు పంచామృత అభిషేకం, భస్మాభిషేకం, గంధాభిషేకం, పన్నీరాభిషేకం అలంకరణ అర్చనాది సేవలను నిర్వహించారు. సాయంత్రం 5 నుంచి రాత్రి 8 గంటల వరకు స్వర్ణ పుష్పార్చనలు నిర్వహించారు. కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లక్ష్మారెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. బీజేపీ నేత వినయ్‌కుమార్, భక్త బృందం సభ్యులు పాల్గొన్నారు.

బుర్రా వెంకటేశంకు అభినందన



కాచిగూడ: రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా నియమితులైన బుర్రా వెంకటేశంను తెలంగాణ రాష్ట్ర జూనియర్ కాలేజ్ ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎ.బాలరాజు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ బి.లక్ష్మయ్య, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎం.పర్వతాలుగౌడ్ కలిసి అభినందనలు తెలియజేశారు.

సమస్యలు, అభివృద్ధి పనులపై సమీక్ష

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులు, సమస్యలకు సంబంధించి నామాలగుండులోని వార్డు కార్యాలయంలో సోమవారం సమీక్ష సమావేశం జరిగింది. వార్డు పరిపాలనా అధికారి సంధ్య, కార్పొరేటర్ సామల హేమ నేతృత్వంలో జరిగిన సమావేశానికి వివిధ విభాగాల అధికారులు హాజరయ్యారు. డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న రహదారుల నిర్మాణం, నాలా అభివృద్ధి, తాగునీటి లైన్ల నిర్మాణాలకు సంబంధించి సమీక్షించారు. సదరు అభివృద్ధి పనులు సత్వరమే ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. మహిళా పొదుపు సంఘాల పనితీరు గురించి చర్చించారు. అదే విధంగా వార్డు కార్యాలయానికి అందుతున్న ఫిర్యాదులు, పరిష్కారానికి సంబంధించిన అంశాలను సమీక్షించారు. ఈ సమావేశంలో జీహెచ్‌ఎంసీ అసిస్టెంట్ ఇంజినీర్ కౌశిక్, అర్బన్ కమ్యూనిటీ ఆఫీసర్ ధనశ్రీ తదితరులు పాల్గొన్నారు.

మైనర్ బాలికపై లైంగిక దాడికి యత్నం

నిందితుడి అరెస్ట్

సుల్తాన్‌బజార్: ఓ మైనర్ బాలికపై లైంగిక దాడికి యత్నించిన ఓ యువకుడిని సుల్తాన్‌బజార్ పోలీసులు కటకటల్లోకి నెట్టారు. ఎస్‌ఐ సతీష్‌కుమార్ తెలిపిన మేరకు.. సుల్తాన్‌బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నివాసముండే వ్యాపారి తన కుమార్తె (14)ను ఇంట్లో వదిలి వెళ్లారు. ఈ క్రమంలో అదే ప్రాంతానికి చెందిన ప్రేమ్‌సింగ్ (21) బాలిక ఒంటరిగా ఉందని గమనించి ఇంట్లోకి దూరి ఆమెపై లైంగిక దాడికి యత్నించాడు. బాలిక కేకలు వేయడంతో స్థానికులు వచ్చి బాలికను రక్షించారు. దీంతో నిందితుడు పరారయ్యాడు. కుటుంబ సభ్యులు సుల్తాన్‌బజార్ పోలీసులను ఆశ్రయించడంతో పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

'ఆరోగ్య మహిళ'ను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటి



మాట్లాడుతున్న జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ వెంకటి

ముషీరాబాద్: ఆరోగ్య మహిళ పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకునేలా ఆశావర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని జిల్లా వైద్య శాఖ అధికారి డాక్టర్ వెంకటి సూచించారు. సోమవారం ముషీరాబాద్ భోలక్‌పూర్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్లు, ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటి మాట్లాడుతూ... ఆరోగ్య మహిళ, ప్రభుత్వ ఆస్పత్రులలో డెలివరీల సంఖ్యను పెంచేలా ఆశావర్కర్లు ప్రభుత్వ ఆస్పత్రులలో కల్పిస్తున్న సౌకర్యాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని అన్నారు. ప్రతి బస్తీ, కాలనీలలో వచ్చే సంవత్సరం మార్చి 31లోపు బీపీ, షుగర్ పేషెంట్లను గుర్తించి నివేదికలు అందజేయాలన్నారు. ప్రతి నెల షుగర్ టెస్టులు, ఎన్‌సీడీ ప్రోగ్రామ్‌లను తప్పనిసరి నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ముషీరాబాద్, భోలక్‌పూర్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు డాక్టర్ దీప్తిప్రియాంక, డాక్టర్ మెహరూన్, పీహెచ్‌ఎన్ భాగ్యలక్ష్మి, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ శ్రీరాముడి అక్షితల పంపిణీ



శ్రీరాముడి అక్షితలతో బీజేపీ ముషీరాబాద్ ఇన్‌చార్జి పూసరాజు తదితరులు

కవాడిగూడ: అయోధ్యలోని భవ్య, దివ్య రామ మందిరం వచ్చే నెల 22న ప్రారంభించనున్న నేపథ్యంలో అయోధ్యలోని శ్రీరాముడికి ప్రత్యేక పూజలు అందుకున్న అక్షితలను సోమవారం ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు లోయర్ ట్యాంక్ బండ్‌లోని శివాలయానికి తీసుకొచ్చారు. హిందువుల దశాబ్దాల ఆకాంక్ష నెరవేరబోతున్న వేళ ప్రతి గడపకూ శ్రీరాముని అక్షితలు చేర్చాలనే లక్ష్యంతో శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టు ఆధ్వర్యంలో జనవరి 1 నుంచి 10 వరకు శ్రీరామ మందిరం అక్షితల వితరణ కార్యక్రమంలో భాగంగా ముషీరాబాద్ నియోజకవర్గం బీజేపీ ఇన్‌చార్జి పూసరాజు నేతృత్వంలో అక్షితలను ఇంటింటికీ తిరిగి పంపిణీ చేశారు. అనంతరం బన్సీలాల్‌పేటలోని మల్లికార్జున నగర్‌లోని ఆర్‌ఎస్‌ఎస్ కార్యాలయంలో భద్రపరిచారు. కార్యక్రమంలో బీజేపీ కవాడిగూడ డివిజన్ అధ్యక్షుడు మహేందర్‌బాబు, పార్టీ నాయకులు విశ్వం, రామిరెడ్డితోపాటు ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

మాదిగలకు మంత్రి పదవుల్లో ప్రాధాన్యమివ్వాలి

హిమాయత్‌నగర్: రాష్ట్రంలో 60 లక్షల జనాభా కలిగిన మాదిగ సామాజిక వర్గానికి జనాభా దామాషా ప్రకారం మంత్రి వర్గంలో సముచిత స్థానం కల్పించి న్యాయం చేయాలని మాదిగ రాజకీయ పోరాట సమితి(ఎమ్మార్పీఎస్) వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు బి.ఎన్.రమేష్ కుమార్ మాదిగ కాంగ్రెస్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ గెలుపునకు మాదిగల ఓట్లు కీలక పాత్ర వహించాయన్నారు. ఈ నేపథ్యంలో మాదిగ సామాజిక వర్గానికి రాష్ట్ర మరో మంత్రి పదవులు కేటాయించాలని కోరారు. మొదటి నుంచి కాంగ్రెస్‌కు స్థిరమైన మద్దతుదారులుగా మాదిగలు ఉన్నారన్నారు. నేతలు ఎం.ఇందిర, లాజర్, కిషోర్, వెంకటస్వామి, చిరంజీవి, విల్సన్, రవి, నాగరాజు, రమణ, సంపత్, ఎల్లయ్య, సాయన్న, నాగభూషణం, కుషాల్, కుమార్, రమేష్, శ్రీనివాస్, గట్టమ పాల్గొన్నారు.

మ్యాజిక్ కళను అభివృద్ధి చేయాలి



లోగో ఆవిష్కరిస్తున్న మ్యాజిక్ సర్కిల్ ప్రతినిధులు

హిమాయత్‌నగర్: మ్యాజిక్ కళను గ్రామీణ స్థాయిలో అభివద్ధి చేయాల్సిన అవసరం ఉందని, వయసుతో సంబంధం లేకుండా 5 నుంచి 60 సంవత్సారాల వారు కూడా మ్యాజిక్ నేర్చుకోవచ్చునని తెలంగాణ అమెరికా అసోసియేషన్ ఇండియా ఆర్గనీ డాక్టర్ ద్వారకనాథ్ అన్నారు. మ్యాజిక్ నేర్చుకోవడం ద్వారా మైండ్ పవర్ పెరుగుతుందని చెప్పారు. సోమవారం బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో 'హైదరాబాద్ మ్యాజిక్ సర్కిల్' లోగోను శ్రీలంక మ్యాజిక్ సర్కిల్ అధ్యక్షుడు రోహన్ జై శేఖర్‌తో కలసి ఆవిష్కరించారు. కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన హైదరాబాద్ మ్యాజిక్ సర్కిల్ అధ్యక్షుడు విజయ్ కాంత్‌ను ఈ సందర్భంగా అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ... మ్యా జిక్ కళ అభివృద్ధికి విజయకాంత్ పడుతున్న తపన మాటల్లో చెప్పలేనిదన్నారు. శ్రీలంక మ్యాజిక్ సర్కిల్ స్థాపించి 100 ఏండ్లు గడిచిన సందర్భంగా మ్యాజిక్ బ్యాడ్జ్‌లను విజయ్ కాంత్‌కు బహూకరించారు. తాము ఇరువురం కలిసి మ్యాజిక్‌ను గ్రామీణ స్థాయి వరకు తీసుకవెళ్లే ప్రయత్నం చేస్తున్నామని పేర్కొన్నారు.

నేడు గీతాంజలి హైస్కూల్ వార్షికోత్సవం

చిక్కడపల్లి: అశోక్‌నగర్‌లోని గీతాంజలి హైస్కూల్ వార్షికోత్సవ వేడుకలు బుధవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో నిర్వహించనున్నట్లు స్కూల్ కార్యదర్శి ఎస్.శాంత తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఓలేటి పార్వతీశం హాజరవుతారన్నారు. ప్రత్యేక ఆహ్వానితులుగా ప్రముఖ రచయిత బీవీఎస్ రవి, సినీ గీత రచయిత సిరాశ్రీ తదితరులు పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు శాంత తెలిపారు.

వనరులను దోచుకున్న వారిని ప్రజా కోర్టులో ఉంచాలి

పంజగుట్ట: గత ప్రభుత్వంలో తెలంగాణ సంపద, వనరులు దోచుకున్న వారి ఆర్థిక నేరాలను వెలికితీసి ప్రజాకోర్టులో పెట్టి వారికి శిక్షపడేలా చర్యలు తీసుకోవాలని ప్రజాస్వామ్య పరిరక్షణ వేదిక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. వేదిక ఆధ్వర్యంలో బృందం ఇటీవల ఢిల్లీకి వెళ్లి కొత్త ప్రభుత్వం ప్రజా పాలన ఎలా ఉండాలి, గత 10 సంవత్సరాల్లో ప్రజలు ఏం కోల్పోయారు, అనే అంశాలతో కూడిన ప్రజా మేనిఫెస్టోను కాంగ్రెస్, బీజేపీ పెద్దలకు ఇచ్చినట్లు సదరు ప్రజా మేనిఫెస్టోను సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సీనియర్ పాత్రికేయులు పాశం యాదగిరి, కోటేశ్వరరావు, రిటైర్డ్ ఐఏఎస్ సుబ్రమణ్యం, సీనియర్ పాత్రికేయులు ఆనంచిన్ని వెంకటేశ్వర్లు, అసిరెడ్డి శివనారాయణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఒక ముఖ్యమంత్రి ఎలా ఉండకూడదో చూపిన కారణజన్ముడు మాజీ సీఎం కేసీఆర్ అన్నారు. పదేళ్లలో చేసిన తప్పులు సరిదిద్దుకుని, ప్రజలకు క్షమాపణ చెప్పాల్సింది పోయి కేటీఆర్ అసెంబ్లీలో ఇంకా తాను మహరాజును అనే విధంగా మాట్లాడుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత బీఆర్‌ఎస్ చీలడం ఖాయమని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి బీఆర్‌ఎస్‌కు అభ్యర్థులు కూడా కరువవుతారని జోస్యం చెప్పారు. తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల స్థలం ఇస్తానని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిందని వారికి భూమి ఇవ్వాల్సిందే కానీ అది ప్రభుత్వ భూమి ఇవ్వకూడదని, రాష్ట్రం ఏర్పడ్డాక భూములు దోచుకున్న ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధుల భూమలు స్వాధీనం చేసుకుని అవి పంచాలని డిమాండ్ చేశారు. ఎవరైనా ఎమ్మెల్యే గతంలోలా అమ్ముడు పోతాను అంటే వారికి రాజకీయ సమాధి కడతామని హెచ్చరించారు. 22వ తేదీన తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టులందరూ గన్ పార్క్ నుంచి ర్యాలీగా వెళ్లి రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన ప్రజా ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలపనున్నట్లు పేర్కొన్నారు.